

ఆకట్టుకుంటున్న బంతిపూల సోయగాలు

డుంబ్రిగుడ మండలం అరకు, చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫాం అందాలతోపాటు బంతిపూల సోయగాలు పర్యటకులను ఆకట్టుకుంటున్నాయి. కురిడి రైల్వే గేటు సమీపంలోని జాతీయ రహదారిలోని మెట్ట పొలాల్లో గిరిజన రైతులు సాగు చేసిన రంగురంగుల బంతిపూల నడుమ పర్యటకులు సరదాగా ఫొటోలు తీసుకుంటూ ఆనందం పంచుకున్నారు. –న్యూస్‌టుడే, డుంబ్రిగుడ

ప్రత్యేక అవసరాల పిల్లలపై శ్రద్ధ

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాలు గల పిల్లల(దివ్యాంగులు)పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా స్కూల్ కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బందికి ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక సుంద్రుపుట్టు ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించారు. డీఈవో ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. దివ్యాంగులు పుట్టిన వెంటనే ఎలా గుర్తించాలి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు ఎలా వర్తింపజేయాలి, ఇతర ప్రయోజనాలు అందించడంపై అవగాహన కల్పించారు. సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకోవడాన్ని వివరించారు. ఏఎంవో భాస్కరరావు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు, స్కూల్ కాంప్లెక్సు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

రంగాలవారీగా.. దూసుకుపోయేలా..

నవ్యాంధ్రను స్వర్ణాంధ్రగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. గత అయిదేళ్ల వైకాపా అరాచక పాలనతో పడకేసిన రంగాలన్నింటినీ గాడిలో పెట్టేందుకు నడుంబిగించింది. జిల్లాల సమగ్రాభివృద్ధికి స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలతో ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. 2047 నాటికి స్వాతంత్ర్య శతాబ్ది వేడుకలకు వికసిత్ భారత్‌గా ఎదిగేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తోంది.

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, పాడేరు

★ వచ్చే అయిదేళ్లలో జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికల తయారీ

★ మౌలిక, పారిశ్రామిక, సేవా రంగాలకు అధిక ప్రాధాన్యం



అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థలో మన రాష్ట్రం కీలక భాగస్వామిగా ఉండేలా స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రాన్ని తయారు చేస్తోంది. దీనికోసం ముందుగా 2024-29 మధ్యలో గ్రామం, మండల, జిల్లా స్థాయిలో రంగాల వారీగా అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలు, లక్ష్యాల రూపకల్పన దిశగా పాలకులు దృష్టిసారించారు. రాష్ట్రంలో పారిశ్రామికంగా అనకాపల్లి జిల్లా కీలక గమ్యస్థానంగా మారుతోంది. సేవల రంగంలో అల్లూరి సీతారామరాజు జిల్లాను ఉన్నతంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

అనకాపల్లి, అల్లూరి జిల్లాలు వ్యవసాయ ఆధారిత జిల్లాలు. ఇక్కడ నీటి వనరులను అభివృద్ధి చేసి, యాజమాన్య పద్ధతుల్లో మార్పులు తీసుకురావాల్సి ఉంది. అలా చేయగలిగితే వ్యవసాయ, అనుబంధ రంగాల్లో ఏటా 15 శాతం వృద్ధిని నమోదు చేయొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

★ అనకాపల్లి జిల్లాలో ప్రస్తుతం ధాన్యం ఉత్పత్తి 2.43 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. వచ్చే అయిదేళ్లలో దీన్ని 3.15 లక్షల టన్నులకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.

★ చిరుధాన్యాలు 2,451 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. 2029 నాటికి దీని విస్తీర్ణం 5,290 హెక్టార్లకు పెంచాలని నిర్ణయించారు.

★ అనకాపల్లి, అల్లూరి జిల్లాలో ప్రస్తుతం 15 వేల హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేస్తున్నారు. రానున్న అయిదేళ్లలో దీన్ని రెట్టింపు విస్తీర్ణానికి తీసుకురానున్నారు.

★ రెండు జిల్లాల్లో బిందు, తుంపర సేద్యం ప్రస్తుతం 5,200 హెక్టార్లలో అమలు చేస్తున్నారు. 2029 నాటికి ఈ విస్తీర్ణం 12 వేల హెక్టార్లకు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు.

పారిశ్రామికం.. ప్రగతి మంత్రం..

జిల్లాల పునర్విభజన తర్వాత పారిశ్రామికంగా రాష్ట్రంలో అనకాపల్లి కీలక ప్రాంతంగా మారింది. ప్రస్తుతం జిల్లా స్థూల ఆదాయ ఉత్పత్తిలో 52 శాతం పరిశ్రమల వాటానే ఉంది. వచ్చే అయిదేళ్లలో 75 శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

★ విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో నక్కపల్లి, రాంబిల్లి నోడ్స్ అభివృద్ధి చెందుతున్నాయి. నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటు కాబోతోంది. అచ్యుతాపురంలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పార్క్ రాబోతోంది. చిన్న పరిశ్రమలకు వీలుగా ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతోంది. వీటి ద్వారా రూ.1.79 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోతున్నాయని, 1.05 లక్షల మందికి ఉపాధి దక్కనుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

★ రొయ్యల సాగు, పాల దిగుబడిని పెంచి స్థూల ఆదాయవృద్ధిలో వాటి శాతం పెరిగేలా లక్ష్యాలు పెట్టుకున్నారు. పాల దిగుబడి ప్రస్తుతం 7.98 లక్షల టన్నులు ఉంటే, వచ్చే అయిదేళ్లలో 11.83 లక్షలకు పెంచాలని నిర్ణయించారు.

★ రాబోయే అయిదేళ్లలో నాతవరం, మాకవరపాలెంలో ఎంఎస్‌ఎంఈ తరహాలో పారిశ్రామిక క్లస్టర్ ఏర్పాటు చేయనున్నారు. వల్లూరు, టి.సిరసపల్లి ఇండస్ట్రియల్ పార్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చి రూ.20 వేల కోట్ల పెట్టుబడులతో 25 వేల మందికి ఉపాధి కల్పించేందుకు అవకాశాలున్నాయని అధికారులు ప్రతిపాదిస్తున్నారు.

సేవల రంగంలో సంతృప్తి స్థాయి దాటేలా..

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం ద్వారా సేవల రంగంలో స్థూల ఆదాయ ఉత్పత్తి (జీవీఏ)ని గణనీయంగా పెంచడానికి అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. స్వదేశ్ దర్శన్ పేరుతో అనంతగిరి మొదలుకొని అరకులోయ మీదుగా పాడేరు, లంబసింగి వరకు ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఇప్పటికే అడుగులు పడ్డాయి. వీటిని పూర్తిచేయగలిగితే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.

అనకాపల్లిలో మాడుగుల నియోజకవర్గంలో కొత్తగా ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు సేవల రంగంలోకి వచ్చే ఇతర ప్రాజెక్టులు, పథకాలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నారు.



కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి పల్లె పండగ కార్యక్రమం మంచి వేదిక అని తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. మంగళవారం పాడేరు మండలం జి.ముంచంగిపట్టు సచివాలయ పరిధిలోని కాగురాయి గ్రామంలో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఎన్నో మంచి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. పలు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తెదేపా జిల్లా నాయకులు బొర్రా నాగరాజు పాల్గొన్నారు.



కాగురాయిలో పల్లె పండగలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తెదేపా నాయకులు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా సంధ్యారాణి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గానికి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గతంలో ఆమె ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంతోపాటు అల్లూరి జిల్లాలో తెదేపా కార్యక్రమాల్లో విస్తృతంగా పర్యటించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా రెండు పర్యాయాలు జిల్లాకు వచ్చారు. అల్లూరి జిల్లాపై ఆమెకు ఎంతో అవగాహన ఉంది. ఏజెన్సీలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసు. సంధ్యారాణిని ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. కాఫీ, మిరియాలు, పసుపు, అల్లం వంటి వాణిజ్య పంటల సాగు విస్తరిస్తుందని, పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని స్థానికులు భావిస్తున్నారు.

పీఎం జన్‌మన్‌లో 27,740 ఇళ్లు మంజూరు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: నిర్దేశించిన గడువు లోపు గృహ నిర్మాణాలను పూర్తిచేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల పరిషత్తు, సచివాలయ, గృహనిర్మాణ, విద్యా, ఐసీడీఎస్, వైద్యారోగ్య, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఎం జన్‌మన్‌లో భాగంగా ఇప్పటివరకూ 27,740 ఇళ్లు మంజూరు చేశామని, మరో 2,623 మంజూరు చేస్తామన్నారు. ఎంపీడీవోలు వారంలో కనీసం నాలుగు సచివాలయాలను సందర్శించి అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షలు జరపాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది ముఖ హాజరు కచ్చితంగా నమోదు చేయాలన్నారు. గిరిజన ఆశ్రమాల్లో మెనూ అమలు కాలేదని ఫిర్యాదులు అందితే ఉపేక్షించనని హెచ్చరించారు. ఉపాధ్యాయ ఖాళీలను సమీపంలో ఉన్న ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని సూచించారు. ఐసీడీఎస్ విభాగంలో పురోగతి పెంచాలన్నారు. అభివృద్ధి ఫలాలు లబ్ధిదారులకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులు, సిబ్బందిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. పంచాయతీ అధికారి లవరాజు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి సూర్యలక్ష్మి, గిరిజన సంక్షేమశాఖ డీడీ రజిని, డీఎల్‌పీవో కుమార్, సీపీఓ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఇవి దొరకవు.. అవి పూర్తికావు!

రిసార్ట్స్‌లో గదుల్లేక పర్యటకుల ఆవేదన!

అరకులోయ, న్యూస్‌టుడే

పర్యటకశాఖ ఆధ్వర్యంలో అరకులోయలో నడుస్తున్న హరిత హిల్, మయూరి హిల్ రిసార్ట్స్‌లో మరమ్మతు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆయా ప్రాజెక్టుల మరమ్మతులకు సుమారు ఏడు నెలల క్రితం నిధులు మంజూరయ్యాయి. మయూరి హిల్ రిసార్ట్స్‌లో రూ.12 కోట్లు, హరిత హిల్ రిసార్ట్స్‌లో రూ.7.6 కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. వాస్తవానికి దసరా సీజన్ ప్రారంభం కావటానికి గదులన్నీ అందుబాటులోకి తీసుకురావాలి. దసరా సెలవులు పూర్తయినా ఇంకా పనులు కొనసాగుతున్నాయి.



మరమ్మతులు జరుగుతున్న మయూరి హిల్ రిసార్ట్స్

ఆన్‌లైన్ గదులన్నీ ఫుల్

పర్యటక శాఖ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 18 వరకు అరకు ప్రాజెక్టు పరిధిలోని గదులన్నీ ఫుల్ అయిపోయాయి. కొన్ని నెలల క్రితమే పర్యటకులు ఆన్‌లైన్‌లో గదులు రిజర్వ్ చేసుకున్నారు. ఇక్కడకు వచ్చేసరికి గదులు అందుబాటులో లేకపోవడంతో నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఇంజినీరింగ్ అధికారులకు ముందు చూపు లేకపోయిందంటూ తీవ్రంగా మండిపడుతున్నారు.

ఈ నెల 16 నుంచి వరసగా ఐదు రోజులు మయూరి హిల్ రిసార్ట్స్‌లో గదులన్నీ పూర్తయ్యాయి. గదులు చూస్తే ఇంకా మరమ్మతుల్లోనే ఉన్నాయి. పర్యటకులు వస్తే వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి స్థానిక అధికారులకు ఎదురవుతోంది.

ఈ విషయంపై పర్యటక శాఖ ఈడీ పద్మావతిని వివరణ కోరగా.. మరమ్మతుల్లో ఉన్న గదులకు సంబంధించి పర్యటకులు చెల్లించిన సొమ్ము రిఫండ్ చేస్తామన్నారు.

ఆదాయానికి గండి

పర్యటకశాఖ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. పర్యవేక్షణ కొరవడటంతో ఎక్కడి పనులు అక్కడే అన్న చందాన మారాయి. ఇటీవల పర్యటకశాఖ సీఈ, ఎస్‌ఈలు వచ్చి వారం రోజుల్లో మరమ్మతులు పూర్తి చేసి గదులను అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఇప్పటికీ పూర్తి కాకపోవడం గమనార్హం. హరిత హిల్ రిసార్ట్స్‌లో సుమారు 20, మయూరి హిల్ రిసార్ట్స్‌లో 18, క్రాఫ్ట్ విలేజ్‌లో 20 గదులు ఇంకా అందుబాటులోకి రాలేదు.

అసంపూర్తి పనులతో క్రాఫ్ట్ విలేజ్



రెండు గ్రామాల్లో పులి పాదముద్రలు

కూనవరం, న్యూస్‌టుడే: అటవీశాఖ సిబ్బంది కూనవరం అటవీ క్షేత్రం పరిధిలోని రెండు గ్రామాల్లో పులి పాదముద్రలను గుర్తించారు. తాటిలంక, దూగుట్టలలో పెద్ద పులి పాదముద్రలు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ రెండు ప్రాంతాల్లోని ప్రదేశాలను డీఎఫ్ భవిత, సబ్ డీఎఫ్ఓ కేవీఎస్ రామవరావు, అటవీ అధికారి ఎం. కరుణాకర్, సిబ్బంది పరిశీలించి అవి పులి పాదముద్రలుగా నిర్ధారించారు. ఈ రెండూ ఒక పులివేనా?, వేర్వేరువా అనే విషయాన్ని ఇంకా తేల్చలేదు. ఈమార్గంలోని గ్రామాల వారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



తాటిలంకలో గుర్తించిన పులి పాదముద్ర



దూగుట్టలో..

బురద.. బస్సులకూ తప్పని బాధ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో మంగళవారం తెల్లవారుజామున వర్షం పడటంతో రహదారి చిత్తడిగా మారింది. రాజవొమ్మంగి శివారు కన్నయ్యమ్మ పేట వద్ద 516-ఈ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. కొంత భాగం మట్టి పనులు చేస్తున్నారు. వర్షం పడటంతో రహదారి బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారుల చక్రాలకు మట్టి చుట్టుకుపోయి వాహనాలు కదలక నానా అవస్థలుపడ్డారు. నర్సీపట్నం నుంచి ఏలేశ్వరం, ఏలేశ్వరం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సుల చక్రాలు సైతం బురదలో కూరుకుపోయి ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. బురదలో బస్సులు కదలక దాదాపు రెండు గంటల పాటు ప్రయాణికులకు నిరీక్షణ తప్పలేదు. హైవే అధికారులు బస్సులను బయటకు తీసి బురదపై డస్ట్ (సిమెంట్, కంకర మిశ్రమం) వేయడంతో రాకపోకలు సాగాయి. రాజవొమ్మంగిలో దాదాపు ఏడాది కిత్రం నుంచి జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని, ఉన్నతాధికారులు దృష్టిసారించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



రాజవొమ్మంగిలో బురదలో నిలిచిన ఆర్టీసీ బస్సులు

మాడగడలో అతిసారం విజృంభణ



అరకులోయ ప్రాంతీయ వైద్యకేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితులు



అరకులోయ, న్యూస్‌టుడే: మండలంలోని మాడగడ పంచాయతీ కేంద్రంలో అతిసార వ్యాధి విజృంభించింది. గ్రామంలోని సుమారు 11 మంది వాంతులు, విరేచనాలతో గత రెండు రోజులుగా బాధపడుతూ అరకులోయ ప్రాంతీయ వైద్యకేంద్రంలో చికిత్స కోసం చేరారు. గ్రామానికి చెందిన అప్పలస్వామి, మహేష్, రాజారావు, గ్రీష్మ, భవానీ, రమేష్, లలిత, ప్రిన్స్, రాములమ్మ, వెంకటలక్ష్మి, బుజ్జిబాబు సోమవారం నుంచి వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారు. వీరిలో పరిస్థితి విషమంగా ఉన్న భవానీని మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖ కేజీహెచ్‌కి అరకులోయ వైద్యులు తరలించారు. గ్రామంలో కలుషిత నీటిని తాగటం వల్లే వీరంతా అస్వస్థతకి గురై ఉంటారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గ్రామంలో రక్షిత నీటిని అందించాలని వారంతా కోరుతున్నారు.

పాడిరైతులకు కూటమి సర్కార్ అండ

అందుబాటులోకి క్రెడిట్ కార్డులు

కలెక్టరేట్, న్యూస్‌టుడే

పశుపోషణపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడిరైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పశువులకు దాణా, మేత, మందులు కొనాలంటే చేతుల్లో డబ్బులు ఉండాల్సిందే. చాలా మంది రైతులకు సకాలంలో డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వచ్చేది. రూ. 10 వేలు కావాలన్న అధిక వడ్డీలను అప్పులు చేయాల్సిన పరిస్థితి. ఈ పరిస్థితుల నుంచి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు శ్రీకారం చుట్టింది.



» పాడి రైతులు తమకు సొమ్ము కావలసినప్పుడు నగదు తీసుకుని అవసరాలు తీర్చుకోవచ్చు.

» ఈ కార్డు ద్వారా గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం అందిస్తారు. రూ.1.60 లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు.

» తీసుకున్న రుణాన్ని 40 రోజుల్లో తిరిగి చెల్లిస్తే 7 శాతం వడ్డీ వసూలు చేస్తారు. ఏడాదిలోపు క్రమం తప్పకుండా చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా చెరో 3 శాతం చొప్పున వడ్డీ రాయితీ ఇస్తాయి. మిగిలిన ఒక్క శాతం రైతులు చెల్లిస్తే సరిపోతుంది.

» సక్రమంగా కార్డులను వినియోగించుకుంటే ఎలాంటి వడ్డీ భారం లేకుండా ఆర్థిక అవసరాలు తీర్చుకోవచ్చు. సాధారణ క్రెడిట్ కార్డు మాదిరిగానే వినియోగించుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేయొచ్చు.

క్రెడిట్ కార్డులు రైతులకు ఆర్థికంగా ఆలంబనంగా నిలుస్తాయి. వీటి ద్వారా అదనంగా పశువులు కొనుగోలు చేసుకోవచ్చు.

పశుసంపద వివరాలు: జిల్లాలోని 22 మండలాల్లో 5.4 లక్షల ఆవులు, 78 వేల గేదెలు, 2.6 లక్షల గొర్రెలు, 2.4 లక్షల మేకలున్నాయని అల్లూరి సీతారామరాజు జిల్లా పశువైద్యాధికారి నరసింహులు తెలిపారు. మొత్తం 3.2 లక్షల మంది పెంపకదారులు ఉన్నట్లు పేర్కొన్నారు. 1000 మందికి ఈ కార్డులు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటివరకు 678 మంది పాడి రైతులకు ఈ కార్డులు పంపిణీ చేశామని ఆయన వివరించారు.

సద్వినియోగం చేసుకోవాలి: పాడిరైతులు ఈ కార్డుల అవసరాలు తీర్చుకోవచ్చు. గరిష్ఠంగా రూ. 3 లక్షల వరకు రుణం అందిస్తాం. అధిక వడ్డీల భారం తగ్గుతుంది. ఈ కార్డులు పొందడానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలి.



– రామ్మోహన్‌రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

వంతెన నిర్మాణానికి రూ.మూడు కోట్లతో ప్రతిపాదనలు

స్పందనకు వందన

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మన్యంలోని లోతట్టు గిరిజన గ్రామాల నుంచి రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.సింహాచలం వెల్లడించారు. మారేడుమిల్లి మండలంలోని సున్నంపాడు పంచాయతీ నూరుపూడి గ్రామానికి చెందిన కెచ్చెల తమ్మిరెడ్డి (35) కడుపునొప్పితో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. దీనిపై ‘వంతెన... కలగానే మిగిలేనా...?’ అనే శీర్షికతో ‘ఈనాడు’లో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి పీఓ స్పందించారు. సున్నంపాడు - నూరుపూడి మధ్య కొండవాగుపై వంతెన నిర్మించాలంటూ అక్టోబర్ రెండున సున్నంపాడులో జరిగిన గ్రామసభలో గిరిజనులు కోరారన్నారు. సుమారు రూ.మూడు కోట్ల అంచనా వ్యయంతో నిధుల చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే వంతెన నిర్మాణం చేపడతామని పీవో వెల్లడించారు. నూరుపూడి తదితర గ్రామాలకు బూసిగూడెం మీదుగా తారురోడ్డు సదుపాయం ఉందని, దీనిపై వాహనాల వెళ్లే అవకాశం ఉందని, దీనిని వినియోగించుకోవాలని పీఓ కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పెదబయలు, న్యూస్‌టుడే: జిల్లాలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ అమిత్ బర్దార్ పేర్కొన్నారు. పెదబయలు మండలం మారుమూల జామిగుడ గ్రామాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎస్సై రమణకు సూచించారు. గిరిజనులు గంజాయి బదులు ప్రత్యామ్నాయ పంటలు పండించుకోవాలని సూచించారు. అనంతరం రూడకోట అవుట్‌పోస్టును పరిశీలించారు. పోలీసు సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. గంజాయి సాగుపై డ్రోన్ కెమెరాల సాయంతో పరిశీలించారు. పెదబయలు ఎస్సై రమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


గంజాయి సాగుపై డ్రోన్‌తో పరిశీలిస్తున్న ఎస్పీ, పోలీసులు

దివ్యాంగ విద్యార్థులకు సహకరించండి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పిల్లల్లో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలను సకాలంలో గుర్తించడం ద్వారా వాటిని సమూల అభివృద్ధికి బాటలు వేయాలని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీలయ్య పిలుపునిచ్చారు. మారేడుమిల్లిలో మంగళవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను కల్పించి వారికి తగిన సహకారం అందించాలన్నారు. వారికి సాధారణ పిల్లలతో సమానంగా విద్యను ప్రభుత్వం అందిస్తుందన్నారు, సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. భవిత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు తిత్తి చిన్నబాబు, జ్యోత్స్న, జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మారేడుమిల్లిలో విద్యార్థుల ప్రదర్శన

రూ.3.5 లక్షల విలువైన గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం పట్టణ శివారులో వాహన తనిఖీల్లో రూ.3.5 లక్షల విలువైన 12.5 కిలోల గంజాయి మంగళవారం పట్టుకున్నట్లు ఆబ్కారీ సీఐ శ్రీనివాస్ తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో ఆబ్కారీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా రాష్ట్రం కలిమెల సమీపంలోని మల్కాన్‌గిరికి చెందిన ప్రదీప్ సర్కార్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీపంలోని పాలగుడకు చెందిన ఇంద్ర ద్విచక్ర వాహనంపై రావడంతో ఆపి తనిఖీ చేయగా వారి వాహనంలో గంజాయి లభ్యమైంది. ఒడిశాలో కొనుగోలు చేసి హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు తరలిస్తున్నట్లు విచారణలో వారు వెల్లడించారు. వాహనాన్ని సీజ్‌చేసి నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.


ఎనిమిది ఇసుక లారీలు సీజ్

చింతూరు, న్యూస్‌టుడే: ఏటపాక మండలం గుండాల నుంచి మైదాన ప్రాంతాల అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది లారీలను తహసీల్దార్ సీహెచ్ చిరంజీవిబాబు, ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం సిబ్బంది సీజ్ చేశారు. సరైన దస్త్రాలు లేకపోగా.. అడిగితే పొంతనలేని మాటలు చెబుతూ డ్రైవర్లు గోకవరం, కాకినాడ తదితర ప్రాంతాలకు ఇసుక తరలిస్తుండటంతో లారీలను సీజ్ చేసినట్లు తహసీల్దార్, ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.


చింతూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఇసుక లారీలు

తొలి అడుగులో విజయం

డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో ఆదరణ



ఈనాడు, అనకాపల్లి -నర్సీపట్నం, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) ల్లో వివిధ ఉత్పత్తులు తయారు చేస్తున్న వనితల ఆదాయాన్ని పెంచేందుకు ప్రతిపాదించింది. వీరు తయారు చేసిన వస్తువులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ సదుపాయం కల్పించాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్వహించిన సమీక్షలో ఈ ఉత్పత్తులను ఈ-కామర్స్‌లో విక్రయించుకునేలా చూడాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులను ఆదేశించారు. ఫలితంగా ఇప్పుడు వీటికి గ్లోబల్ మార్కెట్‌లోకి ప్రవేశానికి అవకాశం దక్కింది. కేంద్రం ఆధ్వర్యంలోని ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓఎన్‌డీసీ) వేదికగా ఆన్‌లైన్ అమ్మకాలకు వీలుగా నర్సీపట్నం, ఎలమంచిలిలోని 55 వస్తువులను యాప్‌లో పొందుపరిచారు.

మరో అరవై సరకులను రిజిస్టర్ చేశారు. వీటి వాణిజ్యాన్ని మరింత విస్తృతం చేయడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) అధికారులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారు.

ఇళ్లలో చిన్నచిన్న వస్తువులు తయారు చేసి ఉన్న ఊరిలో, జిల్లాస్థాయిలో విక్రయించుకున్న మహిళలు ఆన్‌లైన్ వాణిజ్యంలో అడుగుపెట్టారు. నాణ్యత, నవ్యత కలగలసిన ఉత్పత్తులను ప్రపంచానికి పరిచయం చేశారు. తొలి అడుగులోనే అందరి మెప్పు పొందుతున్నారు.


ఎంబ్రాయిడరీ దారంతో తయారుచేసిన గాజులు


ముచ్చటగొలిపే మట్టి, పింగాణి బొమ్మలు



సృజనకు గుర్తింపు దక్కింది: ఏదైనా కొత్తగా ఉండాలనే ఉద్దేశంతో ఎంబ్రాయిడరీ దారంతో ఏడాదిగా గాజులు తయారు చేస్తున్నాను. కుందన్స్ సైతం అతికించడంతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయి. ఆన్‌లైన్‌లోనూ ఇవి పలువురిని ఆకట్టుకుంటున్నాయి. దూరప్రాంతాల నుంచి ఆర్డర్స్ వస్తున్నాయి. ఇంత గుర్తింపు వస్తుందని ఊహించలేదు. ఇన్నాళ్లు జిల్లాలోని వాళ్లకే తెలిసిన ఇవి అంతర్జాతీయ స్థాయికి వెళ్లడం ఆనందంగా ఉంది. వీటికి ఇంకా గిరాకీ అధికమై ఆదాయం పెరుగుతుందని ఆశిస్తున్నాను. ఎస్‌హెచ్‌జీ సభ్యుల మధ్య ప్రత్యేక లింక్ ద్వారా వీటి కొనుగోలుకు అవకాశం కల్పించారు.

– ఎ.ముకుందప్రియ, నర్సీపట్నం



ఇదంతా నమ్మలేక పోతున్నాం: ఆన్‌లైన్లో బుక్ చేస్తే ఇంటికే కావల్సిన వస్తువులు వస్తాయని అందరూ చెబుతుంటే ఆశ్చర్యపోయేవాళ్లం. ఇప్పుడు మేము తయారు చేసిన ఉత్పత్తులకు ఆర్డర్లు వచ్చి ఎక్కడెక్కడో ఉన్న వారు పొందగలుగుతున్నారంటే నమ్మలేక పోతున్నాం. కూటమి ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. నేను అయిదేళ్లుగా ఇంటి వద్దనే మట్టి, పింగాణి బొమ్మలు తయారు చేసి అమ్ముతున్నాను. ఇటీవలే వీటిని మెప్మా అధికారులు ఫొటోలు తీసుకున్నారు. నా బొమ్మలకు ఇప్పటికే ఎనిమిది ఆర్డర్లు వచ్చాయి.

– పక్కి లక్ష్మి, బలిఘట్టం


డిజిటల్ వాణిజ్యంపై పొదుపు సంఘాల మహిళలకు ఇటీవల నిర్వహించిన అవగాహన సమావేశం

ఏడాదిలో వంద ఉత్పత్తులు లక్ష్యం

అందరి సహకారంతో ఎస్‌హెచ్‌జీ సభ్యుల ఉత్పత్తుల డిజిటల్ మార్కెటింగ్‌ను విజయవంతంగా పట్టాలెక్కించగలిగాం. అనుమతి లభించిన వస్తువులను కొనుగోలుదారులకు పంపించడానికి సిద్ధంగా ఉంచుతున్నాం. ఇప్పటికే నర్సీపట్నం, ఎలమంచిలికి చెందిన ఫ్యాన్సీ సామగ్రి, మట్టి, పింగాణీ బొమ్మలు, దారం గాజులు, వస్త్ర సంచులు, బ్లౌజులు, చీరలు, నాణ్యమైన గిఫ్ట్ నగలు తదితర 55 సరకులకు ఆమోదం లభించింది. వీటికి ఆర్డర్స్ వస్తున్నాయి. ఏడాదిలో వంద వరకు ఉత్పత్తులను ఆన్‌లైన్ విక్రయాలకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. డిజిటల్ అమ్మకాలతో నాలుగైదు రోజుల్లోనే నగదు జమ కావడం, కమిషన్ తగ్గడం వంటి ప్రయోజనాలతో మహిళలకు ఆదాయం పెరగనుంది. ఓఎన్‌డీసీ యాప్ నుంచి వీటిని ఎవరైనా బుక్ చేసుకోవచ్చు. – సరోజిని, మెప్మా పీడీ, అనకాపల్లి



గంజాయి పీల్చుతున్న ముగ్గురిపై కేసు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: గంజాయి పీల్చుతున్న ముగ్గురు వ్యక్తులపై అరకులోయ పోలీసులు కేసు నమోదు చేశారు. పానిరంగిని గ్రామానికి చెందిన కొర్ర పవన్‌కుమార్, ఎల్‌బి దీనకుమార్, పూజారి జైప్రకాష్.. సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గంజాయి పీల్చుతుండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు తెలిపారు. వీరివద్ద 100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

700 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

గంగవరం, న్యూస్‌టుడే: బయ్యనపల్లి శివారు అటవీ ప్రాంతంలో అక్రమంగా నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై దాడిచేసి 700 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్సై డి.భూషణం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో బట్టి నిర్వహిస్తున్న ప్రాంతాన్ని గుర్తించి సారా తయారీకి నిల్వచేసిన సుమారు 700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, అయిదు లీటర్ల సారాతో అంగర అంజిబాబును అదుపులోనికి తీసుకున్నామన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేస్తా

అనంతగిరి, న్యూస్‌టుడే: మండలంలో కొందరు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని మండల పరిషత్తు కో- ఆప్షన్ సభ్యుడు మదీనా మంగళవారం ఆరోపించారు. దీనిపై కలెక్టర్ ఫిర్యాదు చేస్తానన్నారు. మంగళవారం చిలకలగెడ్డలో జరిగిన పల్లె పండగ కార్యక్రమానికి కనీసం తనను పిలవలేదన్నారు.

సిరిమానుపై ఇలవేల్పు వైభోగం

ఈనాడు, విజయనగరం

సిరులతల్లి.. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం వైభవంగా సాగింది. పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించగా.. భక్తులు మొక్కులు చెల్లించారు. వేలామంది మహిళలు ఘటాలతో తరలివచ్చారు. కొందరు గొర్రెలు, మేకలు, కోళ్లను తల్లికి సమర్పించారు. మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, గుమ్మిడి సంధ్యారాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ్ చక్రవర్తి, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్, ఎమ్మెల్యేలు రఘురామ కృష్ణంరాజు, అదితి గజపతిరాజు, లోకం నాగమాధవి, బేబినాయన, కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు.




సిరిమాను ఊరేగింపు


దర్శనానికి వెళుతున్న గజపతులు

ఆధ్మాతికతతో మానసిక ప్రశాంతత

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: హిందూ, సనాతన ధర్మాలను గౌరవిస్తూ ప్రతిఒక్కరూ ఆధ్మాత్మిక భావాలు, దేశభక్తి అలవర్చుకోవాలని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు పేర్కొన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల వికాస కేంద్రాల్లో పనిచేస్తున్న ఆచార్యులకు పాడేరు పట్టణంలో మంగళవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సింహాచలం మాట్లాడుతూ.. ఆధ్మాతికతతో మానసిక ప్రశాంతత అలవడుతుందన్నారు. ఆధ్యాత్మిక విలువలతోపాటు దేశ ఔన్నత్యాన్ని పెంపొందించేలా బోధన జరగాలన్నారు. ఆధ్మాత్మిక సేవా సభ్యులు వెంకటరత్నం, ప్రసాదనాయుడు, సహదేవ్, మోహన్‌రావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమానీలకంఠేశ్వస్వామి ఆలయ ధర్మకర్త సింహాచలంనాయుడు

'నెట్'లో లక్ష్మీప్రహర్ష సత్తా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జాతీయ పరీక్ష నిర్వహణ సంస్థ (ఎన్‌టీఏ) నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ టెస్టు (నెట్)లో పేట విద్యార్థిని కొని రెడ్డి లక్ష్మీప్రహర్ష జాతీయస్థాయిలో 127 ర్యాంకు సాధించింది. ఎన్‌టీఏ జులైలో సీఎస్ఐఆర్ నెట్ పరీక్ష నిర్వహించింది. దీనిలో ఆమె ఉత్తమ ర్యాంకు కైవసం చేసుకుంది. పాయకరావుపేటకు చెందిన ప్రహర్ష కేంద్రీయ విశ్వవిద్యాలయం (హైదరాబాదు) నుంచి భౌతికశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ప్రస్తుతం ఫిడ్జీ ఇంటర్నేషనల్ (దిల్లీ)లో ఫిజిక్స్ ఫ్యాక్టల్టీగా పని చేస్తున్నారు. ఆమె 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఐఐటీ, ఎన్ఐటీ లేదా సెంట్రల్ యూనివర్సిటీలో రీసెర్చ్ చేసి డాక్టరేట్ తీసుకోవాలన్నదే తన లక్ష్యమని చెప్పారు. ప్రొఫెసర్‌గా స్థిరపడాలన్నదే కోరికని వివరించారు. లక్ష్మీప్రహర్ష తండ్రి డాక్టర్ కె.వీర్రాజు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా పని చేస్తున్నారు. ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ నాయుడు తదితరులు ఈ విద్యార్థినిని అభినందించారు.



రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు ఎంపిక

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి కత్తిసాము పోటీలకు స్థానిక డీపీఎన్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయులు వి.ప్రభాకర్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళవారం గోవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ కత్తిసాము పోటీలలో ఈ పాఠశాల విద్యార్థి **కె.గుణశేఖర్** అండర్-17 ఫోయల్ స్టయిల్ విభాగంలో సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

గ్రామ పాలనపై పట్టుకు శిక్షణ దోహదం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పాలన, అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులకు అందించే శిక్షణ దోహదపడుతుందని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అన్నారు. జీకేవీధిలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉన్న ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి కీలకంగా మారుతారన్నారు. ఈవోపీఆర్డీ పాపారావు, కార్యదర్శులు, ఉప సర్పంచులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు పంచాయతీ పాలన, నిబంధనలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఎంపీడీఓ లవరాజు దీన్ని ప్రారంభించారు.


జీకేవీధిలో ఉపసర్పంచి, వార్డు సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఎంపీడీవో

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదు

కాకినాడ: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు మంగళవారంతో గడువు ముగిసింది. జులై 29 నుంచి సెప్టెంబరు 3 వరకు అర్హుల నుంచి ఓటు నమోదు దరఖాస్తులు స్వీకరించారు. సెప్టెంబరు 24న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించారు. దీనిపై అభ్యంతరాల స్వీకరణతో పాటు ఈనెల 15 వరకు మిగిలిపోయిన అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇకపై కొత్తగా తీసుకోరు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులపై ఈనెల 30 లోగా విచారణ చేసి, నవంబరు 6న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు. గతనెల 24 నుంచి ఈనెల 15 వరకు కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల వివరాలు మంగళవారం రాత్రికి కూడా కాకినాడ కలెక్టరేట్‌కు చేరలేదు.

చెరువు నిండా కలువలే..

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మన్యంలో ప్రకృతి అందాలకు కొదవ ఉండదు. ఎక్కడ చూసినా ప్రకృతి రమణీయతకు మంత్రముగ్ధులు కావాల్సిందే. శరభవరం పంచాయతీ వణకరాయిలోని ఊర చెరువు నిండా కలువ పుష్పాలు దర్శనమిస్తున్నాయి. పచ్చటి తామర ఆకుల మధ్య తెల్లటి కలువలు అందంగా ఉండటంతో అందరూ ఆసక్తిగా చూస్తున్నారు.



మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మైనర్లకు ఎవ్వరూ వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఇ.నరసింహమూర్తి హెచ్చరించారు. రాజవొమ్మంగిలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై నరసింహమూర్తి మాట్లాడుతూ వాహనదారులంతా అన్ని దస్త్రాలను కలిగి ఉండాలన్నారు. వాహనంపై ముగ్గురు ఉండటంతోపాటు లైసెన్సు లేని పది మందికి అపరాధ రుసుము విధించినట్లు ఎస్సై తెలిపారు.


వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్సై

ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తం

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్య పరిరక్షణపై అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శేషారెడ్డి పిలుపునిచ్చారు. మారేడుమిల్లి కొత్తకాలనీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు వైద్య సేవలు అందించారు. మారేడుమిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.హరికృష్ణ, టీఎన్‌ఎస్‌ఎఫ్ అరకు పార్లమెంటు కార్యదర్శి దూడ ప్రణీత్, మండల తెదేపా ఉపాధ్యక్షుడు దూడ సువర్ణకర్ణకుమార్. వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, న్యూస్‌టుడే: సామాన్యులకు మెరుగైన వైద్యం అందించడమే ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు లక్ష్యమని జీఎస్ఆర్ ఫౌండేషన్ వైద్యులు గోరంట్ల రవిరామ్‌కిరణ్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం వేములకొండ గ్రామంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టరు రవిరామ్‌కిరణ్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వీరాస్వామి, కందుల సాయిబాబు, కంగల అబ్బాయిదొర, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తకాలనీలో రోగులకు సేవలు అందిస్తున్న వైద్యులు

మత్తు పదార్థాలతో భవిష్యత్తు నాశనం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని మండల విద్యాశాఖ అధికారి పనసల ప్రసాద్ అన్నారు. మంగళవారం చింతపల్లిలో మనం సేవా సొసైటీ ఛైర్మన్ గౌతమ్ నరేంద్రమహర్షి ఆధ్వర్యంలో విద్యార్థులు మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ.. మత్తు పదార్థాలతో యువత భవిత నాశనం అవుతుందన్నారు. బాగా చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. హెచ్ఎం అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: యువకులు చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకొవద్దని సీఐ ఎన్.సన్యాసినాయుడు అన్నారు. రాజవొమ్మంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్డంగి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో సీఐ సన్యాసినాయుడు, ఎస్సైలు నరసింహమూర్తి, చిన్నబాబు మంగళవారం గంజాయి నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి నివారణకు సంబంధించి సంకల్పం కరపత్రాలను పంపిణీ చేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బంది పాల్గొన్నారు.

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువుపై శ్రద్ధ పెంచుకోవాలని ఎస్సై సంతోశ్‌కుమార్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వేర్వేరు సమావేశాల్లో ఎస్సై మాట్లాడారు. ఇప్పటి నుండే సమాజంలో మంచి, చెడు మధ్య తేడా గమనించాలని, చెడు సేహ్నాలకు దూరంగా ఉండాలన్నారు.


వీఆర్‌పురం జూనియర్ కళాశాల్లో ప్లకార్డులతో, విద్యార్థులు, ఎస్సై



చింతపల్లి ర్యాలీలో ఎంఈవో, మనం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు

గంగవరం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్సై డి.భూషణం యువతకు సూచించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ కలింకోట కృష్ణ ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన, ఈవ్ టీజింగ్ చేసే పడే శిక్షలు వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, ఇంటర్ విద్య జీవితంలో పెద్ద మలుపు అని అన్నారు. ఏఎస్సై రజాక్, సిబ్బంది శ్రీను, కళాశాల అధ్యపకులు నఫీసా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ తొట్టె అందజేత

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక సచివాలయానికి జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ ట్రాక్టర్ తొట్టెను వితరణగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధి పెద్దది కావడంతో పారిశుధ్య పనులకు ట్రాక్టర్‌కు తొట్టెలేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు, సిబ్బంది తమ దృష్టికి తేవటంతో రూ. రెండు లక్షలు ఖర్చుచేసి అందజేశానన్నారు. సర్పంచి కారం వెంకటేశ్వర్లు, కార్యదర్శి పద్మావతి, ట్రస్టు సభ్యులు జావెద్, జవహార్, రాచూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్‌డ్	213	250
స్కిన్‌లెస్	243	260

ప్రభుత్వం మారినా.. అదే పేరు!

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలకు సంబంధించిన గత వైకాపా ప్రభుత్వం పెట్టిన పేర్లను ప్రస్తుత అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం మార్పులు చేసినా, ఇప్పటికీ అవి అమలుకావడం లేదు. గత వైకాపా ప్రభుత్వం 'రైతుభరోసా కేంద్రాల'ను ఏర్పాటు చేసింది. వీటి కోసం ప్రత్యేకంగా నిధులను కేటాయించి, నూతన భవనాలు నిర్మించింది. ఇదేవిధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో గత ప్రభుత్వం పెట్టిన కొన్ని పథకాల పేర్లను మార్పులు చేస్తూ నిర్ణయం కూడా తీసుకుంది. దీనిలో భాగంగానే 'రైతుభరోసా కేంద్రాల'ను 'రైతుసేవా కేంద్రాలు'గా పేరు మార్చింది. అయితే మారేడుమిల్లిలోని ఈ కార్యాలయానికి సంబంధించిన బోర్డులు మాత్రం ఇప్పటికీ మారలేదు. గతంలో ఏర్పాటు చేసిన 'రైతుభరోసా కేంద్రం'గానే కొనసాగుతుంది. ప్రభుత్వం మారినా ప్రభుత్వ శాఖల తీరు మార లేదనడానికి ఇదే నిదర్శనం.


మారేడుమిల్లిలో రైతుభరోసా కేంద్రం

ముడుపులు తీసుకుని వదిలేశారా?

అటవీశాఖ అధికారులపై అనేక అనుమానాలు

దేవీపట్నం, న్యూస్‌టుడే: వినరమయ్య పేట - సీతారం గ్రామాల మధ్య ఓ పంట పొలంలో గట్టుపై నరికివేతకు గురైన టేకు చెట్టు వివాదం రోజు రోజుకు ముదురుతోంది. రూ.లక్షల విలువచేసే టేకు కలపను అటవీ, రెవెన్యూ అధికారుల అనుమతులు ఏమాత్రం లేకుండా 59 చెట్లు నరికివేయడం సంచలనంగా మారింది. గ్రామంలో ఎవరైనా పెళ్లి పందిరికి పది వెదురు కర్రలు నరికితే కేసులు పెట్టే అటవీశాఖ అధికారులు ఇన్ని టేకు చెట్లు నరికి తరలించికుపోయినా పట్టించుకోపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు సైతం టేకు చెట్ల నరికివేతపై వివరాలు సేకరిస్తున్నారు. ముంపు గ్రామంలో నిర్వాసితులు ఎవరూ లేకపోవడంతో రాత్రి సమయాల్లో అక్రమార్కులు మిషన్ల సాయంతో కలపను నరికి సీతారం రేవు నుంచి వైపునకు తరలించుకుపోతున్నారు. అటవీశాఖలో కొందరు అధికారులకు ముడుపులు చెల్లించి అక్రమార్కులు రాత్రి సమయాల్లో కలప తరలించుకుపోయినట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే ఐంద కూరు రేంజ్ అధికారి కొండలరావు నివేదికను సిద్ధం చేశారు.


నరికివేతకు గురైన టేకు చెట్టు

దారుణంగా దారులు.. ప్రయాణానికి పాట్లు!


ఛిద్రమైన గన్నెల మార్గం

గన్నెల దారిలో బాధలెన్నో!

అరకులోయ ప్రధాన రహదారిలోని గన్నెల కూడలి నుంచి గన్నెలకు వెళ్లే మార్గం పూర్తిగా పాడవ్వడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూడలి నుంచి పూజారిగుడ మీదుగా [illegible] క్రితం రహదారి నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులు చేయలేదు. రోడ్డుపై రాళ్లు తేలి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గానికి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు. – అరకులోయ, న్యూస్‌టుడే

అసంపూర్తిగా ఎర్రగుప్ప రోడ్డు

ఏళ్ల తరబడిగా అసంపూర్తిగా వదిలేసిన లగిశపల్లి- ఎర్రగుప్ప ప్రధాన రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని పరిసర గ్రామస్థులు కోరుతున్నారు. లగిశపల్లి నుంచి తోపులమామిడి, ఎర్రగుప్ప మీదుగా కరకపల్లి వెళ్లే రోడ్డు పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించారు. రోడ్డుపై కంకర వేసి బిల్లులు రావడం లేదనే కారణంతో గుత్తేదారు పనులు నిలిపేశారు. కంకర రాళ్లు అడ్డదిడ్డంగా ఉండటంతో కనీసం కాలినడకన వెళ్లేందుకు కూడా వీలు పడటం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయాలని వారంతా కోరుతున్నారు. – పాడేరు పట్టణం, న్యూస్‌టుడే


లగిశపల్లి నుంచి ఎర్రగుప్పకు వెళ్లే రహదారి ఇలా..

చెట్లు కూలి నిలిచిన రాకపోకలు

వలసగెడ్డ కొత్తూరు నుంచి వలసపల్లి వరకూ సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రహదారి లేదు. గ్రామస్థులు రాకపోకలు సాగించడానికి వీలుగా కాలిబాట తయారుచేసుకున్నారు. ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు కూడా వెళ్లేవి. నిత్యావసర సరకుల రవాణాకు ఇబ్బందులు ఉండేవి కాదు. గత నెలలో సంభవించిన తుపానుకు ఈ రహదారికి అడ్డంగా పెద్ద చెట్లు పడిపోవడంతో ద్విచక్రవాహనం కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిత్యావసర సరకులు తెచ్చుకోవడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సంఘటన జరిగి 40 రోజులు గడిచినా అధికారులు తమ గ్రామాన్ని సందర్శించలేదని, రహదారిని కూడా బాగుచేయలేదని గ్రామస్థులు బలరాం తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ గ్రామ రహదారి బాగుచేయించాలని వారు కోరుతున్నారు. – సీలేరు, న్యూస్‌టుడే


వలసపల్లి దారిలో ద్విచక్రవాహనదారుడి పాట్లు

శిక్షణ తరగతులు రేపటి నుంచి

కొయ్యూరు, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ఈ నెల 17, 18 తేదీల్లో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలు మేరీరోజ్, ప్రేమ్‌సాగర్ తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

అద్దె భవనాల్లోకి అంగన్‌వాడీ కేంద్రాలు

కొయ్యూరు: శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాలను అద్దె భవనాల్లోకి తరలిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి తెలిపారు. బట్ట పనుకుల పంచాయతీ తీగలమెట్టలోని శిథిలమైన అంగన్‌వాడీ భవనాన్ని మంగళవారం సీడీపీవో పరిశీలించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు తమ ఇంటిలో ఓ గదిని కేటాయించి స్థానికి ఒక కుటుంబం ముందుకు రావడంతో అక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. గత నెలలో పి.మాకవరం, కినపర్తి, మునగలమెట్ట, రావణాపల్లి కేంద్రాలను అద్దె భవనాల్లోకి మార్చామని పేర్కొన్నారు.

అనుమతులు తప్పనిసరి

అడ్డతీగల, గంగవరం, న్యూస్‌టుడే: బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ వి.నరసింహమూర్తి, గంగవరం ఎస్సై డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆదేశాలు పాటిస్తూ గోదాములో నిల్వలు, విక్రయాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. దుకాణాలు ప్రజా నివాస స్థలాలకు దూరంగా ఏర్పాటుచేసి నిబంధనలు పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృషి

అరకులోయ/ పట్టణం, న్యూస్‌టుడే: పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెదేపా అరకులోయ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. సుంకరమెట్ట పంచాయతీ దండబాడులో మంగళవారం నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దండబాడు నుంచి లింబగుడ వరకు రూ. 90 లక్షలతో 2 కిలోమీటర్ల మేర నిర్మించనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కొత్తబల్లుగుడ, బొండాం పంచాయతీల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి చిన్నబాబు, తెదేపా, జనసేన నాయకులు శెట్టి బాబూరావు, లక్ష్మణరావు, రాము, నాగరాజు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, అనంతగిరి, న్యూస్‌టుడే: గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెదేపా మండల అధ్యక్షుడు తుడుము సుబ్బారావు అన్నారు. కొర్రా, కితలంగి, కించుమండ పంచాయతీ కేంద్రాల్లో అభివృద్ధి పనులకు ఎంపీడీఓ ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో భూమిపూజ చేశారు. సర్పంచులు సుబ్బారావు, అచ్చుమ్మ, అర్జున్, ఎంపీటీసీ సభ్యురాలు విజయ, కూటమి నాయకులు స్వామి, దన్నేశ్వరరావు, చినగెన్ను, బొంజుబాబు, అధికారులు పాల్గొన్నారు. కొత్తూరు, కాశీపట్నం పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమం ఘనంగా జరిగింది. తెదేపా మండల అధ్యక్షుడు బుజ్జిబాబు, సర్పంచులు సీతయ్య, లక్ష్మి, ఉప సర్పంచి నరేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ గౌతమ్, ఎంపీటీసీ సభ్యుడు సన్యాసి, కో- ఆప్షన్ సభ్యుడు మదీనా, తెదేపా నాయకులు జోగులు పాల్గొన్నారు.

పెదబయలు, న్యూస్‌టుడే: సీతగుంట, అడుగుల పుట్టు, అరడకోట, లక్ష్మీపేట, సీకరి పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఏపీవో అప్పలనాయుడు, మండల ఉపాధ్యక్షుడు కొర్రా రాజు బాబు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ వి.సన్యాసి, సర్పంచి పలాసి మాధవరావు, మాజీ ఎంపీపీ కొండయ్య, కూడా భూషణరావు పాల్గొన్నారు.


జగ్గవరంలో పనులను ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

చింతపల్లి గ్రామీణం, సీలేరు, న్యూస్‌టుడే: చింతపల్లిలో బోర్‌వెల్, సీసీ రోడ్డు, ఇంకుడు గుంతలు, చౌడుపల్లిలోని కొత్తవీధిలో మినీ గోకులం పనులను ప్రారంభించారు. ఎంపీపీ అనూషాదేవి, ఎంపీడీవో ఆశాజ్యోతి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసు, సర్పంచులు పుష్పలత, కొర్రా లలిత, ఏపీవో లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు పూర్ణచంద్రరావు, బుజ్జిబాబు, వెంగళయ్య, కంఠంనాయుడు తదితరులు పాల్గొన్నారు. ధారకొండ పంచాయతీ పరిధిలోని చెక్కలమద్దిలో రూ.7 లక్షల వ్యయంతో కందకాల నిర్మాణానికి సర్పంచి ఎన్.రాజు శంకుస్థాపన చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, కార్యదర్శి రాజ్యలక్ష్మి, కూటమి నాయకులు శోబా జగన్, సీపీఎం నాయకుడు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కూనవరం, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు అన్నారు. పల్లె పండగలో భాగంగా జగ్గవరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన భూమి చదును పనులను కూటమి నాయకులు ప్రారంభించారు. సర్పంచి కారం పార్వతి, పాయం వెంకయ్య, నోముల రామారావు, షరీఫ్, ఏపీవో శ్రీకాంత్, పాల్గొన్నారు.


చింతపల్లిలో..


కొర్రాలో..

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెపండగ నిర్వహించారు. ఆ గ్రామాలకు వచ్చిన అభివృద్ధి పనులు, నిధుల వివరాలను ఉపాదిహామీ పథకం మండల సిబ్బంది చదివి వినిపించారు.

కుండాడ (మారేడుమిల్లి), న్యూస్‌టుడే: 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా మండలంలోని కుండాడ, గుజ్జుమామిడివలస గ్రామాల్లో నిర్వహించిన గోకులం షెడ్డుల నిర్మాణాలకు కుండాడ, గుజ్జుమామిడివలస సర్పంచులు కుండ్ల ప్రభాకర్‌రెడ్డి, కారం లక్ష్మి భూమి పూజ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు కొరగాని సువర్ణరాజు, ఉపాధిహామీ పథకం ఏపీవో రెడ్డి బాబు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పల్లాల రాజ్‌కుమార్‌రెడ్డి, మండల తెదేపా అధ్యక్షుడు గురుకు శేషుకుమార్ పాల్గొన్నారు.

చింతూరు, న్యూస్‌టుడే: నిమ్మలగూడెం, చిడుమూరు పంచాయతీల పరిధిలో నరసింహపురంలో ఉపాధిహామీ పథకంలో రూ. 19.50 లక్షలతో చెరువు పనులను ఎంపీడీవో జి.మోహన్, కూటమి నాయకులు ప్రారంభించారు. ఏపీవో శ్యామ్‌బాబు, మండల తెదేపా, భాజపా, జనసేన అధ్యక్షులు ఇళ్లా చిన్నారెడ్డి, డీవీఎస్ రమణ, మడివి రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల అమలు తప్పనిసరి

ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలో రిసార్టులు, బోట్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పక్కాగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం రిసార్టుల యజమానులు, పర్యాటక బోట్ల నిర్వాహకులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు, అటవీశాఖ అధికారులతో పీవో సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేవీపట్నం మండలం నుంచి పాపికొండల విహారయాత్రకు తిరిగే బోట్లకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉదయం 9.45గంటలకు బయలుదేరిన బోట్లు సాయంత్రం తిరిగి 5.15గంటలకు చేరుకోవాలని నిర్వాహకులకు సూచించారు. భద్రత కోసం ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను పంచేందుకు చర్యలు చేపడతున్నామన్నారు. ప్రస్తుతం తుపాను హెచ్చరికతో ఈ నెల 17వ తేదీ వరకు పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశాన్ని నిషేధించామన్నారు. రిసార్టుల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, కల్పించడంతోపాటు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తహసీల్దార్లు సుబ్బారావు, రామకృష్ణ, రాజు, డీటీ బాలాజీ, సీఐలు రవికుమార్, గోపాలకృష్ణ, రేంజి అధికారి అనూష, ఎంపీడీవోలు సుండం శ్రీనివాసుదొర, జయంతి, ఎస్సైలు షరీఫ్, రాము, పర్యాటకశాఖ అధికారి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.


రిసార్ట్స్, బోట్ల నిర్వాహకులతో మాట్లాడుతున్న పీవో, సబ్ కలెక్టర్

కార్తిక మాసోత్సవానికి ఏర్పాట్లు

కూనవరం, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో భక్తులు పుణ్య స్నానాల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పంచాయతీ అధికారులు ఏర్పాట్లు మొదలు పెట్టారు. సర్పంచి హేమంత్ ఆధ్వర్యంలో కార్యదర్శి సురేశ్ శబరి రేవులో వరదలకు పేరుకుపోయిన బురదను యంత్రాలతో తొలగించారు. తెల్లవారు జామున శబరి, గోదావరి సంగమానికి వచ్చే భక్తులకు చీకటి సమస్య కాకూడదని విద్యుద్దీపాలు ఏర్పాటు చేయనున్నట్లు కార్యదర్శి చెప్పారు. గోదావరి రేవులోనూ ఈ చర్యలు ఉంటాయన్నారు.


శబరిరేవులో బురదను తొలగిస్తున్న జేసీబీ


బాకూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న జీసీసీ మేనేజర్ వెంకటేష్

కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

హుకుంపేట, న్యూస్‌టుడే: కాఫీ రైతుల ఆర్థికాభివృద్ధికి జీసీసీ కృషి చేస్తోందని సంస్థ పాడేరు మేనేజర్ వెంకటేష్ పేర్కొన్నారు. బాకూరు పంచాయతీ కేంద్రంలో నాలుగు గ్రామాల కాఫీ రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు నాణ్యమైన పంటను మూడు, నాలుగు దశల్లో సేకరించాలని కోరారు. జీసీసీ పార్చిమెంట్ రూ.285, చెర్రీ రూ.150లకు కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా జీసీసీకి పంట విక్రయించాలని కోరారు. ఐటీడీఏ, నాబార్డు అందించే రాయితీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి లీలావతి, సుధీర్, సర్పంచి వెంకటరమణరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌పురం తహసీల్దార్‌గా సరస్వతి


మాట్లాడుతున్న తహసీల్దార్

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వీఆర్‌పురం తహసీల్దార్‌గా సరస్వతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ డీటీ సుబ్బారావు నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఆమె గోకవరం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ప్రజా సమస్యలు సత్వరం పరిష్కరించేలా అందరం కలిసి పనిచేద్దామని ఆమె వివరించారు.

కనులపండువగా అమ్మవారి జాతర

మోతుగూడెం, న్యూస్‌టుడే: మోతుగూడెం జెన్‌కో ప్రాజక్టు పరిధిలోని పొల్లూరులోని మాతృశ్రీ ధారాలమ్మ జాతర మంగళవారం కన్నుల పండుగగా జరిగింది. ప్రతి దసరా తర్వాత వచ్చే మంగళవారం ఈ జాతరను వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. పొల్లూరు, మోతుగూడెం గ్రామాల మహిళలు అమ్మ వారికి పసుపు, కుంకుమలు సమర్పించారు. గ్రామస్థులంతా ఘటాలతో భారీ ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు తరలి వచ్చి, అమ్మవారికి చీరలు, కానుకలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.


పొల్లూరులోని ధారాలమ్మ అమ్మవారు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగులలో ఏజెన్సీ దసరా ఉత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. దసరా అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా మత్స్యమాడుగులమ్మ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి మణికుమారి స్వగృహం నుంచి డప్పు వాయిద్యాలతో ఘటాలను ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకెళ్లారు. ఆలయంలో మణికుమారి ప్రత్యేక పూజలు చేశారు.


మత్స్యమాడుగులమ్మకు పూజలు చేస్తున్న మణికుమారి

జి.మాడుగుల, న్యూస్‌టుడే: సింగర్భలో జాకారమ్మ తల్లి జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటుచేశారు. ఆలయ పూజారులు పెద్దబ్బాయి, గణేష్‌నాయుడు, నీలకంఠంనాయుడు, భక్తులు పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరులో దుర్గమ్మ నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మంగళవారం భారీ ఎత్తున అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఏపీ జెన్‌కో ఎస్ఈలు రామభద్రరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, సీఆర్పీఎఫ్ ఇన్‌ఛార్జి సహాయ కమాండెంట్ వీసీహెచ్ పాండే, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రహదారి!

హుకుంపేట, న్యూస్‌టుడే: సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రజల బాధలు తీరుతాయని ఎమ్మెల్యే మత్స్యలింగం పేర్కొన్నారు. హుకుంపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పక్కా రహదారుల నిర్మాణానికి కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు రమ, సర్పంచి పూర్ణిమ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.


హుకుంపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

కలాం సేవలు చిరస్మరణీయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని చింతపల్లి చేయూత వారియర్స్ ట్రస్ట్ సభ్యులు మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రపంచం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త, యువతకు మార్గనిర్దేశకుడు కలాం అని ట్రస్ట్ ఛైర్మన్ దూనబోయిన రమణ కొనియాడారు. ఆయన దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వర్తక సంఘం పెద్దలు పెదిరెడ్ల బేతాళుడు, గిరి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలాం జయంతిని వేర్వేరుగా నిర్వహించారు. ప్రిన్సిపల్ చలపతిరావు, అధ్యాపక సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చావడికోట సర్పంచి సాదల ప్రేమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బొడ్లంకలో మంగళవారం పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆసుపత్రి పరిసరాల్లో మద్యం దుకాణాలు వద్దు

రంపచోడవరం, న్యూస్‌టుడే: స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి ఏరియా ఆసుపత్రి వరకు ఎటువంటి మద్యం దుకాణాలు నిర్వహించవద్దని భాజపా నాయకులు, మాజీ ఉపసర్పంచి కె.ఎల్.ఎన్.జి ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లామని ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ రహదారిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డైట్ కళాశాలలతో పాటు ఆశ్రమ పాఠశాలలు ఉన్నాయన్నారు. మద్యం షాపులు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయన్నారు.

రూ.2.24 కోట్లతో భవనాలు మంజూరు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమశాఖ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆశాఖ డీఈఈ రఘునాథరావు అన్నారు. మంగళవారం ఆ శాఖ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులతో సమావేశం నిర్వహించారు. సబ్ డివిజన్ పరిధిలో జన్‌మన్ పథకం రూ.2.24 కోట్ల నిధులతో నాలుగు మల్టీపర్పస్ భవనాలు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.60 లక్షల నిధులను కేటాయిస్తున్నట్లు చెప్పారు. చింతపల్లిలో రూ.11 కోట్ల ఎన్‌సీఏ నిధులతో శిక్షణ కేంద్రం నిర్మాణం చేపట్టామని, 70 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఏఈఈలు యాదకిషోర్, శ్రీవిద్య, పాల్గొన్నారు.

27 నుంచి సత్యదీక్షలు ప్రారంభం

అడ్డతీగల, న్యూస్‌టుడే: సత్యదీక్షలు ఈ నెల 27 నుంచి ప్రారంభం అవుతున్నాయని అన్నవరం దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. అడ్డతీగల పవనగిరి క్షేత్రంలో మంగళవారం సూపరింటెండెంట్ చేతుల మీదుగా సత్యదేవ దీక్షా వస్త్రాలను భక్తులకు అందజేశారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకట్రామయ్య మాట్లాడుతూ తొలివిడతలో పురుషులకు దీక్ష వస్త్రాలను అందజేస్తుండగా రెండో విడతలో స్త్రీలకు దీక్షా వస్త్రాలు, పూజాసామగ్రి అందజేస్తామన్నారు. అన్నవరం దేవస్థానం సిబ్బంది సురేష్, శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.


మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172

రంపచోడవరం, న్యూస్‌టుడే

?: మండలంలోని తాటివాడ వెళ్లే రహదారిలో కల్వర్టు వద్ద గోతులుపడ్డాయి. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మరమ్మతులు చేయించి ఇబ్బందులను తొలగించాలి. – బొరగ గంగరాజు, తాటివాడ

✓: తాటివాడ వెళ్లే రహదారిలో కల్వర్టుల వద్ద పడిన గుంతలకు మరమ్మతులు చేయించి ఇబ్బందులు తొలగిస్తాం. – సాయిసతీష్, డీఈ, ర.భ.శాఖ, రంపచోడవరం.



మారేడుమిల్లి, న్యూస్‌టుడే

?: మారేడుమిల్లిలోని గిరిజన సహకార సంస్థ (జీసీసీ)కు చెందిన అదనపు గోదాము నిర్మాణం చాలాకాలంగా అసంపూర్తిగానే నిలిచిపోయింది. క్రమంగా ఇది శిథిలస్థితికి చేరుతోంది. నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలి. – రాము, మారేడుమిల్లి

✓: మారేడుమిల్లిలోని జీసీసీ అదనపు గోదాము నిర్మాణాన్ని పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఉన్నతాధికారులకు నివేదిస్తాం. – పార్వతీశ్వర్రావు, జీసీసీ డీఎం, రంపచోడవరం


?: మారేడుమిల్లి నుంచి పూజారిపాకలు వెళ్లే దారిలోని కల్వర్టు శిథిలస్థితికి చేరింది. క్రమంగా దీని శ్లాబు కుంగిపోతుండడంతో ఎప్పుడు ప్రమాదం సంభవిస్తుదోననే ఆందోళన వ్యక్తం అవుతుంది. – జగన్నాథరావు, వేటుకూరు

✓: శిథిలస్థితికి చేరిన కల్వర్టు స్థానంలో మరొకటి నిర్మించడానికి అవసరమైన చర్యలు చేపడతాం. ఇందుకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తాం. – వెంకటరమణ, మండల ఇంజినీరింగు అధికారి, మారేడుమిల్లి

యంత్రాల వినియోగంతో రైతులకు మేలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఆధునిక యంత్రాలను వినియోగించి పంటలను సాగు చేయడం ద్వారా సమయం, నగదు ఆదా అవుతుందని చింతపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు జాహ్నవి అన్నారు. మంగళవారం డౌనూరు పంచాయతీ గుమ్మడివానిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరి పొలాలు పరిశీలించారు. ఆధునిక యంత్రాల వినియోగంపై అవగాహన కల్పించారు. వరిలో సమగ్ర పంటల యాజమాన్యంపై పాడేరు డీఆర్సీ వ్యవసాయ అధికారి విజయలక్ష్మి వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి, పశువైద్యాధికారి దుర్గాప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించగలమని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్‌బాబు అన్నారు. దోడిపుట్టు, బాకుబెడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. బాకుబెడ గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించి రసాయన ఎరువుల వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధకశాఖల అధికారులు మోహన్‌రావు, అనురాధ, పరశురామ్, యమున తదితరులు పాల్గొన్నారు.


బాకుబెడలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


వరి పొలంలో రైతులతో చింతపల్లి సహాయ సంచాలకులు జాహ్నవి, వ్యవసాయ అధికారులు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పొలం పిలుస్తోంది కార్యక్రమంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఉప ఎంపీపీ ఆనందరావు, పెదవలస సర్పంచి కృష్ణవంశీ అన్నారు. పెదవలస, కొత్తగూడెం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో మెలకులవలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి మధుసూధన్‌రావు, భాజపా మండల అధ్యక్షుడు వనపల జోగిరాజు, తెదేపా నాయకులు మామిడి బాలయ్యపడాల్, జనసేన నాయకుడు పరమేశ్వరరావు పాల్గొన్నారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ పరికరాలు, విత్తనాలు సమకూర్చుకోవాలని ఏఓ ఉమామహేశ్వరి అన్నారు. టోకూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచి మోస్య, తెదేపా నాయకులు దొన్ను తదితరులతో కలిసి పంట పొలాలు పరిశీలించారు. సిబ్బంది పాల్గొన్నారు.